ఈనాడు
సంగారెడ్డి
శుక్రవారం అక్టోబరు 18, 2024

రామాయణ పారాయణంతో నైతికవిలువల పెంపు: కలెక్టర్


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వల్లూరు క్రాంతి, అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి జీవిత చరిత్ర తెలుసుకుని నేటి తరం ముందుకు సాగాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం సమీకృత కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణంలోని ప్రతి ఘట్టం నైతిక, సామాజిక విలువలను ఉపదేశిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజారాణి, బీసీ అభివృద్ధి అధికారి జగదీశ్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా టీకాలు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకా కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. పట్టణ శివారు శ్రీవైకంఠపురంలో జిల్లా స్పెషల్ జడ్జి సునీతతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. టీకాలు వేయిస్తే ఇబ్బందులుండవన్నారు. గోశాలలో 145 ఆవులను టీకాలు వేశారు. అనంతరం వైకుంఠపురం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ సీహెచ్ రవీంద్రప్రసాద్, సహాయ సంచాలకులు డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్లు యామిని, అజిత్ చంద్ర, తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం



పట్టణంలోని శ్రీ భవాని మందిరం వార్షికోత్సవాలు గురువారం వైభంగా జరిగాయి. ఉదయం ధ్వజారోహణం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమార్చన చేశారు. ఉత్సవాల్లో పురపాలక సంఘం అధ్యక్షురాలు అపర్ణపాటిల్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రాజు, నరేందర్, తులసీదాసు, నర్సింగ్‌రావు, అర్జున్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, సదాశివపేట.

'దండం పెడతాం.. నిదానంగా వెళ్లండి'



బీదర్- జహీరాబాద్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దీంతో చాలా మంది చనిపోతున్నారని హద్నూర్ సీఐ జక్కుల హన్మంతు అన్నారు. ఇటీవల పలువురు మరణించడంతో పలు కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొన్నాయని వాపోయారు. ముఖ్యంగా కర్ణాటక బస్సులతో ఎక్కువ ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు గురువారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గంగ్వార్ చౌరస్తా వద్ద కర్ణాటక, మహారాష్ట్ర ఆర్టీసీ బస్సులను ఆపి డ్రైవర్లు, కండక్టర్లకు పుష్పగుచ్ఛాలు అందించారు. నెమ్మదిగా వెళ్లాలని, ఎవరి మరణానికి కారణం కారాదని సూచించారు. కార్యక్రమంలో గంగ్వార్ మాజీ సర్పంచి శ్రీనివాస్, మల్లప్ప, ఆటోడ్రైవర్లు, స్థానిక యువత పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, న్యాల్‌కల్.

19న కొప్పోల్‌లో మహారుద్రం

గుమ్మడిదల, న్యూస్‌టుడే: ఈనెల 19వ తేదీన పెద్దశంకరంపేట మండలం కొప్పోల్‌లో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి ఆదేశానుసారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం గుమ్మడిదల శ్రీకృష్ణానంద సరస్వతీ స్వామి ఆశ్రమంలో ఆయన మాట్లాడారు. శనివారం కొప్పోల్ ఉమాసంగమేశ్వరస్వామి దేవాలయంలో మాధవానంద సరస్వతిస్వామి పర్యవేక్షణలో మహారుద్రం, 1,100 లీటర్లతో అభిషేకం, లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

రక్షణ కల్పిస్తే.. సురక్షితం

దారుల్లో పొంచి ఉన్న ప్రమాదాలు

జిల్లాలోని ప్రధాన రహదారుల పక్కన చెరువులు, కుంటలు, పాత బావులు, కల్వర్టుల వద్ద సరైన రక్షణ చర్యలు లేవు. ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా, ప్రమాదానికి ఆస్కారం ఉంది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లెలో బుధవారం వాగులోకి కారు దూసుకెళ్లి ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అటువంటి ఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం తక్షణం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, కంది, జోగిపేట, రాయికోడ్, మనూరు, జహీరాబాద్.

జిల్లా కేంద్రం సమీపంలో..

జిల్లా కేంద్రం సమీపంలోని కంది మండలం చిమ్నాపూర్ చెరువు కట్టపై కార్లు, ఆటోలు రాకపోకలు సాగిస్తాయి. కాశీపూర్‌లోని కలివేములకు వెళ్లేదారిలో చెరువు, కొండాపూర్ మండలం చెర్ల గోపులారానికి వెళ్లే దారిలో మల్లేపల్లి పెద్ద చెరువు ప్రమాదకరంగా మారింది. ఆయా ప్రాంతాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి.


కంది మండలం చిమ్నాపూర్ చెరువు వద్ద ఇలా..

అన్నాసాగర్ వద్ద..


అన్నాసాగర్ చెరువు కట్టపై నుంచి వెళుతున్న బస్సు

అందోలు మండలం అన్నాసాగర్ చెరువు కట్టపై నుంచి బస్సులు, ఇతర వాహనాలు వెళుతుంటాయి. అప్రమత్తంగా లేకుంటే ఇటు చెరువులోకి, అటు 20 అడుగుల లోతులో ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. గతంలో ఈ కట్టపై బస్సులు, లారీలు, జీపులు కార్లు వంటి వాహనాలు ప్రమాదాలకు గురైన ఘటనలున్నాయి.

జలాశయాల చెంత..

రాయికోడ్ మండలం సిరూర్ సమీపంలో రహదారికి ఇరువైపులా రక్షణ గోడలు లేవు. గతంలో పలుమార్లు వాహనాలు అదుపుతప్పి అందులో పడి ప్రాణాలు కోల్పోయారు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. రాయికోడ్ సమీపంలోని వంతెన వద్ద ఇటీవల వంతెన రెయిలింగ్ కూలిపోయింది.


మంజీర నది వద్ద ఇరువైపులా..

రాయిలపల్లి శివారులో..

మనూరు మండలం రాయిపల్లి శివారులో మంజీర నదిపై నిర్మించిన వంతెన రెయిలింగ్ ధ్వంసమైంది. ఇప్పటివరకు అధికారులు మరమ్మతులు చేయలేదు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.


పడిపోయిన రెయిలింగ్

వరద ప్రవహిస్తే..

జహీరాబాద్ మండలం కర్ణాటక సరిహద్దులో బూచినెల్లి శివారులో నారింజ వాగు ఉంది. కొద్దిపాటి వరద వచ్చినా కల్వర్టు పైనుంచి పారుతోంది. న్యాల్‌కల్ మండలం చాల్కి- అమీరాబాద్ వంతెనపై నుంచి నారాయణఖేడ్, మనూరు, బీదర్‌కు కలిపే దారి ఉంది. ఇక్కడా అదే పరిస్థితి.


జహీరాబాద్ శివారులో కల్వర్టు దుస్థితి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: ఎస్ఈలు ఏసయ్య, జగదీశ్వర్, ఈఈ రాంబాబు

జిల్లాలో పీఆర్, ఆర్అండ్‌బీ శాఖ రహదారుల వెంట ప్రమాదకరంగా ఉన్నప్రాంతాల్లో సూచికలు, కంచె, రెయిలింగ్ ఏర్పాటు చేస్తాం. నీటి వనరుల వద్ద, మంజీర పరీవాహక ప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకుంటాం.

గంజాయి రవాణా కట్టడికి పకడ్బందీ చర్యలు: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్, చిత్రంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి రవాణా, హస్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మనూరు మండలం దొవ్వూరు కూడలి వద్ద టీఎస్-న్యాబ్ పోలీసులు, మనూరు ఎస్సై, సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేయగా, కారు డిక్కీలో 40 కిలోల ఎండు గంజాయి లభించింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నాం. బీదర్ జిల్లా బసవేశ్వర్ చౌక్‌కు చెందిన మల్లగొండగా గుర్తించాం. చోరీ కేసుల్లో బీదర్ జిల్లాలో జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో ఒడిశాకు చెందిన రాహుల్ చక్రవర్తి, బాల్కికి చెందిన మల్లేశ్ యాదవ్, మహారాష్ట్రకు చెందిన దాదాపాటిల్‌తో ఇరువురికి పరిచయం ఏర్పడింది. ఇరువురు జైలు నుంచి ఇటీవల బయటకు వచ్చారు. సెప్టెంబరులో జహీరాబాద్ సమీపంలోని చిరాగ్‌పల్లిలో 140 కిలోల ఎండు గంజాయి తరలించే క్రమంలో ఇరువురు తప్పించుకునట్లుగా మల్లగొండ నేరం అంగీకరించడంతో, రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

అమీన్‌పూర్‌లో హష్ ఆయిల్ స్వాధీనం..: అమీన్‌పూర్ మండలం బీరంగూడ వేంకటేశ్వర ఆలయం సమీపంలో హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై విజయ్‌రావు ఘటన స్థలానికి చేరుకుని కోయిలకండ్ల అఖిలేష్, అమీన్‌పూర్‌కు చెందిన మంద్రగుట్టి ప్రేమ్, పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన దాసుసాయి శివను అదుపులోకి తీసుకుని విచారించగా వారంతా నేరం అంగీకరించారు. వీరు కళాశాల విద్యార్థులే లక్ష్యంగా హష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్నట్లుగా తేలింది. దాసుసాయి శివ ఆంధ్రప్రదేశ్ విశాఖలోని అరకు నుంచి 50గ్రాముల హష్ ఆయిల్ తెచ్చి ఆలయ సమీపంలో విక్రయిస్తున్నాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా అఖిలేష్, ప్రేమ్‌ల పాత్ర ఉన్నట్లుగా తేలింది. ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని ఎస్పీ చెప్పారు. జిల్లాలో అక్రమంగా గంజాయి సాగు చేసినా, రవాణా చేసిన 87126 56777 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసుల ఛేదనలో కృషి చేసిన పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక దృష్టి

మునిపల్లి, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలిగి, వారికి అండగా నిలవాలని ఎస్పీ రూపేష్ సూచించారు. గురువారం మునిపల్లి ఠాణాను ఆయన తనిఖీ చేశారు. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. జాతీయ రహదారిపై నిత్యం వాహన తనిఖీ చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించి సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, సీఐ చంద్రయ్య, ఎస్సై రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఇసుకపై కన్ను.. తవ్వేస్తున్నారు మన్ను!



సంగారెడ్డి మండలం హన్మాన్‌నగర్‌లో కృత్రిమ ఇసుక దందా కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్నారు. అనంతరం కడగడంతో మట్టి తొలగి ఇసుక మిగులుతుంది. ఆరబెట్టాక, సంగారెడ్డి, జహీరాబాద్ తరలించి ట్రాక్టర్‌కు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్.

ఉత్సాహంగా కళా ఉత్సవ్ పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు గురువారం సైన్స్ కేంద్రంలో గురువారం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఏఎంవో అనూరాధ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ పాఠశాలల నుంచి వంద మంది చిన్నారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

19న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా బాలికల అండర్-17 క్రికెట్ ఎంపికలు ఈ నెల 19న ఎంఎస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఒర్జినల్ బోనాఫైడ్‌తో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

డీఆర్‌డీవో పరిశీలన

పుల్కల్, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యులు రుణాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని డీఆర్‌డీవో జ్యోతి అన్నారు. చౌటకూరు మండల పరిధి శివ్వంపేటలో స్త్రీనిధి రుణాల ద్వారా వ్యాపారాలు నిర్వహిస్తున్న మహిళల దుకాణాలను ఆమె పరిశీలించారు. మహిళా శక్తి పథకం ద్వారా సభ్యులు రుణాలు తీసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. అధికారులు పాల్గొన్నారు.

మినీ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి

హత్నూర:దౌల్తాబాద్‌లో మినీ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్‌కు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆమెను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు.

ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట: మంత్రి పొన్నం


క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే పెద్ద పీట వేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో గురువారం ఎంపీ క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గురుకుల భవనాల అద్దెలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, కళాశాలలకు బోధనా రుసుముల బకాయిలున్న మాట వాస్తవమేనని, చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బకాయిల పేరుతో బంద్ పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని ఆర్టీసీ డిపోలకు బస్సులు అందిస్తామన్నారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించేందుకు క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎ.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, మహ్మద్ తన్వీర్ పాల్గొన్నారు.

ఆలు సాగుకు అవరోధం!

న్యూస్‌టుడే, జహీరాబాద్: రెండు నెలలుగా నిత్యం కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి ఆలు సాగుకు అవరోధంగా మారింది. జూన్‌లో సాగైన వానాకాలం పంటల ఉత్పత్తులు చేతికి రాగానే, ఆ పొలాలను చదును చేసి అక్టోబరు రెండోవారంలో ఆలు విత్తనం వేస్తారు. వానాకాలం పంటలు దెబ్బతినగా, కనీసం ఆలు సకాలంలో సాగు చేద్దామని రైతుల ఆశిస్తున్నా, నిరాశే ఎదురవుతోంది. పొలాల్లోని నీరు, తేమ పోవాలంటే నెలరోజుల పైనే పడుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమయానుసారం వేస్తేనే: ఉమ్మడి మెదక్ జిల్లాలో 8వేల నుంచి 10వేల ఎకరాల్లో ఆలు సాగవుతోంది. ఇందులో ఒక్క జహీరాబాద్ డివిజన్‌లో అత్యధికంగా 60 శాతానికి పైగా వేయగా, సంగారెడ్డి, అందోలు, పటాన్‌చెరు, గజ్వేల్ నియోజకవర్గంలో సాగు చేస్తారు. జూన్‌లో సాగు చేసే పెసర, మినుము, సోయాబీన్ పంటల ఉత్పత్తులు చేతికి వచ్చాక, ఆయా పొలాలను చదును చేసి అక్టోబరులో రెండోవారంలో ఆలు విత్తనం వేయడం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రైతులు గడువులోపే విత్తనం, ఎరువులు తెచ్చి ఇళ్లల్లో నిల్వ ఉంచారు. వర్షాలతో వాతావరణం చల్లగా ఉండడంతో బస్తాలు నిల్వ ఉంచిన ఆలుగడ్డ మురిగిపోతూ, మొలకలు వస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం చలిగా ఉంటే దిగుబడులు అధికంగా వస్తాయని, ఇపుడే అనువైన సమయమని, ఆలస్యమైతే విత్తనం దెబ్బతినడమే కాకుండా, వాతావరణంలో వచ్చే మార్పులతో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.


సోయాచేనులో వరద

పెరిగిన విత్తనం ధర: ఆలు విత్తనం తెలుగు రాష్ట్రాల్లో లభించడం లేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా, జలంధర్ తదితర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నారు. దీంతో విత్తనం కంటే రవాణా ఛార్జీలు ఎక్కువై అధిక భారమవుతోందని పేర్కొంటున్నారు. గతేడాది ఆగ్రా విత్తనం ధర క్వింటా రూ.2500 ఉండగా, ఈ ఏడు రూ.3,200 నుంచి రూ.3,600 వరకు పలుకుతోంది. జలంధర్ విత్తనం ధర గతేడాది రూ.2వేలు పలకగా, ఈ ఏడు రూ.3వేలు పలుకుతోంది. ఎకరానికి ఆరు క్వింటాళ్ల విత్తనం అవసరం ఉంటుందని రైతులు తెలిపారు.

అందోలులో పీఏల పాలన నడుస్తోంది: క్రాంతికిరణ్

జోగిపేట, న్యూస్‌టుడే: అందోలు నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ పాలన నడుస్తలేదని, పీఏల పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆరోపించారు. గురువారం జోగిపేట ఠాణాలో మంత్రి దామోదర్ రాజనర్సింహపై ఆయన ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గాంధీ ఆసుపత్రి ఆవరణలో జరిగిన సమావేశంలో మందుల కొరతపై విలేకరులు మంత్రిని ప్రశ్నిస్తుండగా, ఆయన వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ.. మావాళ్లు.. మీవాళ్లు అంటూ మాట్లాడటం తప్పు కాదా అని ప్రశ్నించారు. వేరు చేస్తూ మాట్లాడినందుకు మంత్రిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పీఏలు చెప్పినట్లుగా పోలీసులు వినడం శోచనీయమన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో భారాస నాయకుడు నవీన్‌రెడ్డి పెట్టిన పోస్టులపై పోలీసులు అదే విధంగా కేసు నమోదు చేశారన్నారు. ఏకపక్షంగా వ్యవహరించి పార్టీ నాయకులను వేధించడం తగదన్నారు. జోగిపేట ఏఎంసీ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, నాయకులు శ్రీధర్, నాగరత్నంగౌడ్, మల్లేశం, నర్సింలు పాల్గొన్నారు.



మార్గదర్శకాలు పాటించకుండా కమిటీలా?

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఏర్పాటు సమయంలో అన్ని వర్గాలతో చర్చించాలని కోరారు. నాయకులు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

కోళ్ల పెంపకం.. ఆదాయ మార్గం



మహిళా సంఘాలకు స్త్రీనిధి చేయూత

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: పెద్దగా పెట్టుబడి ఖర్చు లేకుండా ఆదాయం, ఆరోగ్యానికి ఆరోగ్యం.. ఇంకేం కావాలి. ఇదేంటి అనుకుంటున్నారా! పెరటి కోళ్ల పెంపకంతో చేకూరే ప్రయోజనాలివి. ఈ పథకానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోంది. ఎంపికైన మహిళా సంఘాల సభ్యులకు కోడి పిల్లలు కొనుగోలుకు రుణాలు ఇస్తారు. వీటి ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటూనే, గుడ్లు, మాంసంతో పౌష్టికాహారం కూడా అందించవచ్చన్న ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. జిల్లాలో మహిళా సంఘాలు 18,208 ఉండగా, సభ్యులు 1.91 లక్షలున్నారు.

పౌష్టికాహారం లోపాన్ని అధిగమించేలా..: పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం ప్రస్తుతం జిల్లాలో కోళ్ల సంఖ్య ఆరు లక్షలు. మాంసం, గుడ్ల అవసరాలకు ఇవి సరిపోవడంలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి సరఫరా చేసుకుంటున్నారు. ధర ఎక్కువగా ఉండడంతో పేదలు కోడి మాంసం, గుడ్లను ఆహారంలో తీసుకోలేని పరిస్థితి. దీంతో పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం లేకపోవడం, అనారోగ్యంతో ఆసుపత్రుల ఖర్చులు భరించలేక వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. వీరి ఇబ్బందులు తీర్చాలన్న లక్ష్యంతోనే పెరటి కోళ్ల పెంపకం దిశగా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నారు.

రుణ సదుపాయం, వాయిదాలు: 100 కోళ్ల యూనిట్స్(4-6 వారాల కోళ్లు) కొనుగోలు, పోషణకు రూ.22,000 రుణంగా అందిస్తారు. 50ఉన్న యూనిట్‌కు రూ.12,500 అందజేస్తారు. వార్షిక వడ్డీ 11శాతంతో కలిపి 24 నెలసరి వాయిదాలతో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. పెరటి కోళ్ల మదర్ యూనిట్(కోడి పిల్లల పెంపకం కేంద్రాలు)కు కూడా స్త్రీనిధి ద్వారా రుణం ఇస్తారు. యూనిట్ విలువ రూ.2.91 లక్షలు ఉంటుంది. నెలకు రూ.6,400 చొప్పున 60 నెలసరి వాయిదాల్లో రుణాన్ని తిరిగి చెల్లించాలి.

సద్వినియోగం చేసుకోవాలి: శ్రీనాథ్, ప్రాంతీయ మేనేజర్

పెరటి కోళ్ల పెంపకానికి ఇస్తున్న రుణ సదుపాయాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. కోళ్ల పెంపకంతో కుటుంబానికి పౌష్టికాహారం అందుతుంది. ఇంటి అవసరాలకు పోగా మిగిలిన గుడ్లు, కోళ్ల విక్రయాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. తక్కువ పెట్టుబడితో దీనిని సాధించవచ్చు.

వర్షం.. రైతుల దైన్యం



జోగిపేట పట్టణంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కొంత వరద పాలైంది. వివిధ గ్రామాలకు చెందిన రైతులు ధాన్యాన్ని ఇక్కడ ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జోగిపేట టౌన్.

తీగల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

సంగారెడ్డి టౌన్: కంబాలపల్లి శివారులో పంట పొలాల్లో ఉన్న విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. అయినా విద్యుత్తు అధికారులు పట్టించుకోవడంలేదని 'పచ్చందం మాటున ప్రమాదం' శీర్షికన ఈనెల 17న ప్రచురితమైన కథనానికి అధికారులు అదే రోజు స్పందించారు. తీగలను తొలగించడంపై రైతులు హర్షం వ్యక్తంచేశారు.

ఆలయాల సంరక్షణతో ప్రశాంతత


సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రతి నిత్యం ఆలయాలను దర్శించుకుని, ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. సంగారెడ్డి వాణి మందిరంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆలయాల సంరక్షణ, సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. దైవనామస్మరణతో యువతకు మంచి నడవడిక అలవడుతుందని, భక్తి వైపు దృష్టి మళ్లించాలని సూచించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుతర బాధ్యతతో అడుగెయ్

"పాఠశాల రూపురేఖలను మార్చాలంటే కృతనిశ్చయం అవసరం. తోటివారితో పాటు పిల్లలు, తల్లిదండ్రుల మనసు గెలవాలి. సంకల్పం నెరవేరే వరకు విశ్రమించొద్దు."

ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు ప్రత్యక్ష మార్గదర్శి. క్రమశిక్షణ, అంకిత భావం, సేవా కోణం, చైతన్య కెరటం.. ఇలా భిన్న పాత్రల సమాహారమే గురువు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో తాజాగా వందలాది మంది ఉపాధ్యాయ కొలువులు చేపట్టారు. వీరంతా తమ ప్రత్యేకతను చాటాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఇందులో సాగుతున్న ఎంతో మంది మార్గదర్శకంగా నిలిచారు. తమదైన శైలి.. సృజనాత్మక బోధనతో విద్యార్థులతో మామంచి మాస్టారు అని కీర్తినొందుతున్నారు. ఇలాంటి ఆదర్శప్రాయులను నవతరం బోధకులు అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, సిద్దిపేట



జాతీయ పురస్కారం గెలిచి..



సిద్దిపేటకు చెందిన రామస్వామి 2015 నుంచి 2022 వరకు ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేశారు. బడిని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో గురుతర పాత్ర పోషించారు. బాధ్యత చేపట్టిన ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చారు. విద్యార్థులు 300 మంది నుంచి వేయి సంఖ్య దాటేందుకు సమష్టిగా కృషి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సాంకేతిక వినియోగంలో స్ఫూర్తి చాటారు. 2022లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం సిద్దిపేట డీఈవో కార్యాలయంలో ప్రణాళిక విభాగం సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట

బడిని బతికించి..



"ఎంతోమందిలో విద్యా వెలుగులు నింపేది పాఠశాలే. దీని సంరక్షణ అందరి బాధ్యత. బడి మాది అనుకుంటే పిల్లలెంతో మంది బాగుపడ్డట్లే."

మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ పాఠశాలలో 2015లో విద్యార్థుల సంఖ్య కేవలం 8 మందే. స్థానిక పిల్లలంతా ప్రైవేటుకు వెళ్తున్నారు. ఈ తరుణంలో హెచ్ఎంగా ఓంకార్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులుగా నుస్రత్, రామకృష్ణారెడ్డి బదిలీపై వచ్చారు. బడిని బతికించుకోవాలని కంకణం కట్టుకున్నారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారిని ఒప్పించి పిల్లలను ప్రైవేటుకు పంపించమని తీర్మానం చేయించారు. వారికి స్థానికులు అండగా నిలిచారు. ప్రస్తుతం 207 మంది ఉన్నారు. ఇప్పటికీ ఆ ఉపాధ్యాయులు చైతన్యంతో బడి వెలిగిపోతోంది. పలు పురస్కారాలూ దక్కాయి. – న్యూస్‌టుడే, ములుగు

వారితో మమేకమై..



"విద్యార్థుల మనసు గెలవడం కాసింత కష్టమే. అలాంటి వారు ఎక్కడో ఓ చోట కనిపిస్తారు. ఒక్కసారి పిల్లలను ఆకట్టుకుంటే గుండెల్లో పెట్టుకొని పూజిస్తారు."

కొడంగల్ పరిధి పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన క్రాంతికుమార్.. విద్యార్థులతో మమేకమై బోధించారు. పిల్లలకు అన్నిరకాలుగా అండగా నిలిచారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పేదలకు సాయం అందించారు. నవోదయ, గురుకుల వంటి పరీక్షల్లో విజయానికి కృషి చేశారు. తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత చెప్పి బడికి పంపించేలా చేశారు. విధుల్లో చేరిన సమయంలో 27 మంది ఉండగా.. ఆ తర్వాత 64కు చేరింది. ఇటీవల హుస్నాపూర్‌కు బదిలీ కాగా, ఆ సమయంలో విద్యార్థులు, గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు.

– న్యూస్‌టుడే, కొడంగల్

పిల్లలు నష్టపోవద్దని..



"ఆకట్టుకునేలా బోధించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం. ఇందుకు ఎంతో కృషి అవసరం. వారి సర్వతో ముఖాభివృద్ధికి చొరవ చూపాలి."

సాధారణంగా సెలవు దొరికితే ఎవరైనా సరదాగా గడపుదాం అనుకుంటారు. రామాయంపేట ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకుడిగా రమేశ్ మాత్రం అలా కాదు. మండలంలోని కాట్రియాల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకులు లేకపోవడంతో ఈయనే చొరవ చూపి అక్కడికెళ్లి పాఠాలు చెబుతూ వచ్చారు. సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠ్యాంశాలు బోధిస్తారు. మరోవైపు ఇతర పిల్లలకు సైతం ఇంగ్లిష్ నేర్పించడం విశేషం.

– న్యూస్‌టుడే, రామాయంపేట

"సమాజ పరిస్థితిని మార్చడంలోనూ ఉపాధ్యాయుడిది కీలకపాత్ర. ఈ మార్గంలో నడిస్తే ఎంతో మంది బాగుపడటం ఖాయం."

మానవత్వం చాటుతూ..



మతిస్థిమితం లేని బాలికను చేరదీసి..

గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన జంగం సౌజన్య మెదక్ జిల్లా కొడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. ఈమె సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. ఎవరైనా అనాథలు, ఆపదలో ఉన్న వారు కనిపిస్తే చలించిపోతారు. మతిస్థిమితం కోల్పోయిన వారిని చేరదీసి వారి ఆకలిని తీరుస్తున్నారు. ఆశ్రమాల్లో చేర్పిస్తారు. మహిళలను సఖి కేంద్రానికి తరలిస్తున్నారు. ఇప్పటివరకు 8 మందిని ఆదుకున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

అన్నింటా తీర్చిదిద్ది..



విద్యార్థులతో శ్రీనివాసరావు

"విద్యార్థుల భవితకు మార్గం చూపాల్సిన గురుతర బాధ్యత గురువులదే. దీన్ని ఎటి పరిస్థితుల్లోనూ మరువద్దు."

– న్యూస్‌టుడే, జిన్నారం

జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం జడ్పీ పాఠశాల హెచ్ఎంగా 8 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అబ్బాద శ్రీనివాసరావు.. తెలుగు ఉపాధ్యాయుడైన ఈయన విద్యార్థులు వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేలా చేశారు. ప్రత్యేక చొరవ చూపి 150 మంది బాలకులు, 200 మంది పుస్తక సమీక్షలో, మరో 100 మంది కథలు రాసే ప్రతిభావంతులుగా రూపుదిద్దడంలో కీలకంగా వ్యవహరించారు. సెలవులను సైతం ఇందుకే కేటాయించేవారు. ఇటీవల ఎద్దుమైలారం జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు.

సైన్స్‌లో ఇప్పటికీ వెనకబడి ఉన్నాం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



ఐఐటీహెచ్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తికి అవార్డు అందజేస్తున్న ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ సతీష్‌రెడ్డి చిత్రంలో డాక్టర్ భుజంగరావు, ఎస్.బి.రామ్, లక్ష్మీనారాయణ

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని పలు చిన్నదేశాలు విభిన్న అంశాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, 140 కోట్లకుపైగా జనాభా ఉన్న అతి పెద్ద దేశం భారత్ ఈ విషయంలో ఇంకా వెనకబడి ఉందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. చిప్స్ తయారీలో ముందున్న తైవాన్‌పై బలమైన దేశాలు ఆధారపడుతున్నాయని.. ఈ తరహాలో భారత్ సైతం కొన్ని అంశాల్లో ఆధిపత్యానికి ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ మంత్రి మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ డైరెక్టర్ జనరల్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటి తెలుగు ఉపకులపతి డాక్టర్ సూరి భగవంతం జయంతి వేడుకలు గురువారం ఓయూలోని దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. మనదేశం రక్షణ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా స్వయం సమృద్ధి సాధించడం వెనక డీఆర్డీవో డీజీగా డాక్టర్ సూరి భగవంతం వేసిన పునాదే కారణమని డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ దూరం లక్ష్యాన్ని గురిపెట్టే గన్ భారత్‌లో మాత్రమే ఉందని.. ఈ దశకు చేరుకోవడంలో సూరి కృషి ఉందన్నారు.

ఐదుగురికి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సూరి భగవంతం ఎక్సలెన్స్ అవార్డులను ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్. మూర్తి, ఇస్రో-ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్, ఇంటిలిజెంట్ డిజైన్ ఏఐ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డకు ప్రదానం చేశారు. డీఆర్‌డీవో మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ యు.రాజబాబు స్థానంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఏ.ఎస్.మూర్తికి, రవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మొచ్చెర్ల శశిభూషణ్ స్థానంలో శరత్‌కు అవార్డులను బహూకరించారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో మాజీ డీజీ వి.భుజంగరావు, డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.బి.రామ్ తదితరులు మాట్లాడారు.

వేదన.. రోదన

- శోకసంద్రంగా మారిన తూప్రాన్ ఆసుపత్రి ఆవరణ
- మృతదేహాల కోసం వచ్చిన బాధితులు



విషణ్ణవదనాలతో బాధిత కుటుంబ సభ్యులు



తూప్రాన్, శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతిచెందిన విషయం విదితమే. గురువారం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కట్టుదిట్టమైన పోలీసుల భద్రత మధ్య శవ పంచనామా నిర్వహించారు. ఈ సమయంలో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. ఈ క్రమంలోనే కొంతమంది సొమ్మసిల్లి కింద పడిపోయారు. మృతదేహాలను చూసేందుకు బంధువులు భారీగా తరలివచ్చారు. డీఎస్పీ వెంకటరెడ్డి, ఆస్పత్రి పర్యవేక్షకులు అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల సమయంలో శవ పంచనామా ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఏడు మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. మృతదేహాలను ట్రాక్టర్‌లో ఎక్కించే సమయంలో మృతురాలు అనిత భర్త మోహన్ బంధువులు ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నామ్‌సింగ్‌ను తీసుకొచ్చే వరకు మృతదేహాలను తీసుకెళ్లమని నిరసన తెలిపారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

పోలీసు పహారాలో అంత్యక్రియలు

శివ్వంపేట మండలంలోని మూడు తండాల్లో పోలీసు భద్రత మధ్య రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు జరిగాయి. భీమ్లా తండాలో గూగులోత్ శాంతి, ఆమె కూతురు మమత (10వ తరగతి), జగ్య తండాలో మాలోత్ అనిత, ఆమె కుమార్తెలు హిందు(8వ), శ్రావణి (5వ), తాళ్లపల్లి తండాలో ధనావత్ శివరాం, దుర్గి అంత్యక్రియలు చేపట్టారు. మూడు కుటుంబాల వారు రక్తసంబంధీకులు కావడంతో ఎక్కడి వారు అక్కడే అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సంఘటనకు కారకుడైన భీమ్లా తండాకు చెందిన కారు డ్రైవర్ గుగులోత్ నామ్‌సింగ్‌ను అప్పగించాలని ఆగ్రహించిన అనిత బంధువులు ఆయన కుమారుడు రాజేష్‌పై చేయి చేసుకున్నారు. భీమ్లా తండా, జగ్య తండాలో బాధిత కుటుంబాలను శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మృతదేహాలకు నివాళి అర్పించారు. రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. శివ్వంపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు మహేష్ గుప్తా బాధిత కుటుంబాలను తూప్రాన్ ఆసుపత్రిలో బుధవారం రాత్రి పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.



జగ్యా తండాలో ఆవేదనలో అనిత భర్త మోహన్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



అంజయ్య

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో ఓ రైతు పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెల్పుల అంజయ్య (51)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు, తరచుగా కుటుంబ కలహాలు చోటుచేసుకుంటుండటంతో అంజయ్య పోతారెడ్డిపేటలో కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య గంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో వృద్ధుడు..

తూప్రాన్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్‌లో గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. పండ్ల వ్యాపారి ఉడుత నాగయ్య (75) తూప్రాన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఓ ఇంట్లో భార్య లక్ష్మితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నాగయ్య పక్కనే ఉన్న రేకుల షెడ్డుల్లో ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి లక్ష్మికి భర్త కనిపించకపోవడంతో బయటకు వెళ్లేందుకు యత్నించింది. గడియ పెట్టి ఉండటంతో పక్కింటి వారి సాయంతో బయటకు వచ్చి చూడగా నాగయ్య విగతజీవిగా కనిపించాడు. నాగయ్య మృతిపై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గిరిజన న్యాయ కళాశాల పిలుస్తోంది!

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

ఈనెల 19న తక్షణ ప్రవేశాలు

గిరి పుత్రులను న్యాయ విద్యలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట న్యాయ కళాశాలను ఏర్పాటుచేసింది. దేశంలో గిరిజన (పురుషుల) గురుకుల న్యాయ కళాశాల ఇదొక్కటే కావడం విశేషం. ప్రస్తుతం న్యాయ విద్య కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 19న తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఇక్కడ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం విశేషం.



గిరిజన గురుకుల న్యాయ కళాశాల

కళాశాలలో విద్యార్థులు
- ప్రథమ: 20
- ద్వితీయ: 26
- తృతీయ: 27
- నాలుగో: 37
- ఐదో: 31


ఐదేళ్ల కోర్సు..

ఇంటర్ అర్హతతో లాసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్లు సైతం వర్తింపజేస్తారు. ఇక్కడ సీటు సాధిస్తే ఐదేళ్లలో న్యాయ విద్య కోర్సు (బీఏ, ఎల్‌ఎల్‌బీ) పూర్తి చేయవచ్చు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతోంది. ఏటా 60 మందికి తొలి సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ కళాశాలను ఎంచుకోకపోవడంతో సీట్లు మిగిలిపోతున్నాయి. గత విద్యా సంవత్సరం 34 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు షురూ అయిన నేపథ్యంలో ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

మెరుగైన సదుపాయాలు

కళాశాలలో సీటు సాధిస్తే ఎలాంటి ఖర్చు లేకుండానే కోర్సు పూర్తి చేయవచ్చు. భోజన, వసతి సదుపాయాలు ఉంటాయి. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 కంప్యూటర్లతో కూడిన ఈ-గ్రంథాలయం కూడా ఉండటం విశేషం. విద్యార్థుల ఆరోగ్యానికి బాటలు వేసేలా ఆధునిక వ్యాయామశాల ఏర్పాటుచేశారు.

సద్వినియోగం చేసుకోవాలి నిరీక్షణరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్



సంగారెడ్డిలోని గిరిజన సంక్షేమ గురుకుల న్యాయ కళాశాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తొలి సంవత్సరంలో 60 సీట్లకు అత్యధికంగా 51 సీట్లు ఎస్టీలకే ఉంటాయి. మిగతా వాటిని రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తారు. ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాం. ప్రవేశాలు పొందిన వారిలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు హైకోర్టులో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ సమయంలో స్టైఫండ్ అందుతుంది.



మెదక్ చర్చిలో విదేశీయుల సందడి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్‌లోని సీఎస్ఐ చర్చిని గురువారం అమెరికాకు చెందిన 19 మంది సందర్శించారు. వారు ప్రార్థనా మందిరంలో ఆరాధన చేపట్టారు. చర్చిని సందర్శించి స్వీయ చిత్రాలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు. పలువురు వారితో చిత్రాలు దిగి సందడి చేశారు. – న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

పల్లె నుంచి సినీ దర్శకుడిగా..



సిద్దిపేట జిల్లా చేర్యాల పరిధి గుర్జకుంటకు చెందిన పుర్మ స్మరణ్‌రెడ్డి సినీ దర్శకుడిగా మారడం అక్కడి వారిలో సంతోషాన్ని నింపింది. అతడికి సినిమాలు అంటే ప్రాణం. అదే ఇష్టంతో అడుగేసి చిత్ర దర్శకుడిగా మారడం విశేషం. స్మరన్‌రెడ్డి తల్లిదండ్రులు అరుణ, రాంభూపాల్‌రెడ్డి. కుటుంబం చేర్యాలలో స్థిరపడగా, స్మరణ్‌రెడ్డి పది వరకు స్థానికంగా చదువుకున్నారు. ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు. సినిమాలపై మక్కువతో ఇంజినీరింగ్ పూర్తవగానే ఈ రంగాన్ని ఎంచుకున్నారు. చిత్ర దర్శకురాలు నందినిరెడ్డి వద్ద సహాయకుడిగా పనిచేశారు. 2017లో 'ఎమోషన్' లఘుచిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'లవ్ రెడ్డి' సినిమా రూపొందించారు. 'ఆంధ్ర- కర్ణాటక' రాష్ట్రాల సరిహద్దులో యువ జంట ప్రేమే ఈ చిత్ర కథాంశం. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. వాస్తవ ఘటనల ఆధారంగా నా తొలి చిత్రాన్ని రూపొందించానని, మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు డ్రిస్టిబ్యూట్ చేయడం సంతోషంగా ఉందని స్మరణ్‌రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, చేర్యాల

నీతో మేమూ వస్తాం..

- పక్కింటి యువకుడి బైకు ఎక్కిన విద్యార్థులు
- బస్సు ఢీకొని ముగ్గురూ దుర్మరణం



నవీన్‌కుమార్ హర్షవర్ధన్ ప్రవీణ్‌కుమార్

పూడూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడితో సహా యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరోయువకుడు ప్రాణాలు వదిలారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పూడూరు గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గొంగుపల్లికి చెందిన ఎం.ప్రవీణ్(21) కూలీ. అతడికి భార్య అఖిల, ఏడాది కుమారుడు ఉన్నారు. మేడికొండలోని తన అమ్మమ్మ ఊరిలో శుభకార్యానికి రెండు రోజుల కిందట ఒంటరిగా వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థులు వికారాబాద్ వైపు వెళ్లాల్సిన చిల్కమర్రి నవీన్‌కుమార్(20), బుడ్డమొళ్ల హర్షవర్ధన్(15) తమను మన్నెగూడలో దింపాలని అభ్యర్థించారు. దీంతో అతడు కాదనలేక ఇద్దరినీ తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. గ్రామం నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పైకి చేరుకున్నారు. సరిగ్గా పూడూరు గేటు వద్దకు ద్విచక్రవాహనం రాగానే.. హైదరాబాద్ నం-1 డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు నేదం వెళ్తుండగా.. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనాన్ని నడిపే ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో స్థానికులు అతడిని పరిగి ఆస్పత్రికి తరలిస్తుండగా.. దారిలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద కారణాల్ని సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ అధికారులు బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున సహాయం అందించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

కళాశాలకు వెళ్తూ..

మేడికొండకు చెందిన చిల్కమర్రి యాదయ్య, అంజమ్మలకు ముగ్గురు కుమారులు. వారిది వ్యవసాయ కుటుంబం. చిన్నవాడు నవీన్‌కుమార్ వికారాబాద్‌లోని శ్రీ అనంతపద్మనాభ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఆర్మీ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దసరా సెలవులు ముగిసిన దరిమిలా.. కళాశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రవీణ్ బైక్ లిఫ్ట్ అడిగాడు.

ఎస్సీ గురుకులానికి..

మేడికొండకు చెందిన బుడ్డమొళ్ల చిన్ననర్సింలు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కూలీ పనులు చేసుకుంటున్నారు. పెద్ద కుమారుడు స్థానికంగా పదోతరగతి చదువుతుండగా.. చిన్నకుమారుడు హర్షవర్ధన్ వికారాబాద్ పట్టణ పరిధి అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ముగియడంతో గురుకులానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఎక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఇద్దరూ పక్కపక్క నివాసాల్లో ఉండడంతో స్థానికంగా విషాదం అలుముకొంది.

ఆధారం కోల్పోయిన కుటుంబం..

ప్రవీణ్‌కుమార్‌కు దోమ మండలం దాదాపూర్‌కు చెందిన అఖిలతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య, కుమారుడు ఇద్దరూ.. దసరాకు పుట్టింటికి వెళ్లారు. దీంతో భర్త ఒక్కడే శుభకార్యానికి వెళ్లాల్సి వచ్చింది. అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తన ఆధారం కోల్పోయామని కన్నీరు మున్నీరైంది.

వాహనం ఢీకొని.. వివాహిత దుర్మరణం



వనిత

వర్గల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వివాహిత మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన దేవేందర్ కుటుంబీకులతో హైదరాబాద్ దోమలగూడలో ఉంటూ పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. పండగకు ఇంటికి వెళ్లిన తల్లి గోపన్నగారి వనిత(46) సహా దేవేందర్ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమం జరిగిన ప్రమాదంలో దేవేందర్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోయాడు. తల్లి వనిత రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. వనితకు భర్త, ఇద్దరు కుమారులు దేవేందర్, చాణక్య ఉన్నారు.

కారు బోల్తాపడి వ్యాపారి..

కొండపాక గ్రామీణం (కుకునూరుపల్లి): కారు బోల్తాపడి ఓ వ్యాపారి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ కాచిగూడలో కార్వ రాజేశ్(42) వ్యాపారం చేస్తున్నాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి కారులో గురువారం తెల్లారుజామున తిరుగు ప్రయాణమయ్యాడు. రాజీవ్‌రహదారిలో కుకునూరుపల్లి వద్ద రోడ్డు పక్కన ఇనుప కడ్డీలకు తాకి అనంతరం మరో కారును ఢీకొని బోల్తాపడింది రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు కాల్వ బేణిగోపాల్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

సిద్దిపేట టౌన్: రాజీవ్‌రహదారిపై రంగీలా దాబా చౌరస్తా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల మల్లారెడ్డి (65)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. గురువారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. మల్లారెడ్డిని హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోదరుడు యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కళలకు జీవం పోయడం అభినందనీయం



రామలింగేశ్వరాలయంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొలుపుల మహేశ్

దుబ్బాక, న్యూస్‌టుడే: అంతరించి పోతున్న ఒగ్గు కళలకు తెలంగాణ ప్రభుత్వం జీవం పోసి, వెలికి తీయడం అభినందనీయమని ఒగ్గు కథల ప్రధాన శిక్షకులు కొలుపుల మహేశ్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి వారి ఆధ్వర్యంలో గురువారం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఒగ్గుకథ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సహకారంతో ప్రారంభించిన ఈ శిక్షణ శిబిరంలో 40 మందికి 41 రోజులపాటు ఒగ్గు కథపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సహాయ శిక్షకులు గుట్టయ్య, దేవయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

ఇద్దరు న్యాయమూర్తులకు పదోన్నతులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇద్దరు న్యాయమూర్తులకు పదోన్నతులు కల్పిస్తూ, బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారికి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ కరీంనగర్ జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఆర్.అనితకు బాధ్యతలు అప్పగించారు. అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి షాలినీకి అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టుకు పదోన్నతి కల్పిస్తూ ఆమెను సంగారెడ్డికి కేటాయించారు. ఆమె స్థానంలో జోగిపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ధనలక్ష్మికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

దత్తాత్రేయుడి సన్నిధిలో పొన్నం, షెట్కార్

నారాయణఖేడ్: శరత్ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ కర్ణాటకలోని ఘాణగాపూర్‌కు కుటుంబ సమేతంగా వెళ్లారు. దత్తాత్రేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమంలో పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



విద్యార్థులకు సంచులు పంపిణీ చేస్తున్న సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో చదివే పేద పిల్లలకు స్వచ్ఛంద సంస్థల చేయూత అవసరమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం సేవోద్గం ఫౌండేషన్ ప్రతినిధులు జయశ్రీ, చంద్రశేఖర్, కార్తీక్ సహకారంతో గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. నియోజకవర్గానికి రూ.125 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం మంజూరైందన్నారు. త్వరలో ఐటీఐ మంజూరు కానుందన్నారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్ చౌహాన్, హెచ్‌ఎం మన్మథ కిషోర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖ ఏఏఈగా నాగరాజు

జోగిపేట: విద్యుత్తు శాఖ ఏఏఈగా నాగరాజు నియమితులయ్యారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన శ్రావణ్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇదే కార్యాలయంలో జేఏఈగా విధులు నిర్వహించిన నాగరాజు పదోన్నతి పొందారు. పదోన్నతి పత్రాన్ని డీఈ శ్రీనివాస్ అందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: కల్హేర్ మండలం మార్డికి చెందిన కాశీరాం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.60 వేలు మంజూరయ్యాయి. దానికి సంబంధించిన చెక్కును గురువారం జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ గుర్రపు మశ్చేందర్ కాశీరాం కుటుంబీకులకు అందించారు. పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ జలంధర్, ఫౌండేషన్ ప్రతినిధులు చెన్నారెడ్డి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, భారాస నాయకులు సంగన్న, అంబయ్య, రాజు, శ్రీకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలని నిరసన

జోగిపేట: పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. గురువారం అందోలు మండలంలోని పోసానిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, కృష్ణయ్య, మీరాబాయి, అనిత, శివకుమార్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

కోహీర్: మండలవ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి జాకీర్ హుసేన్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు తిరుమలేష్‌తో గురువారం పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు శ్రీధర్‌నాథ్, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

మురుగు పారే దారేది?

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

పురపాలికలో భూగర్భ మురుగు కాలువ కలగానే మిగిలింది. ఆరేళ్ల కిందటే పుర అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. దీంతో మురుగు మహబూబ్‌సాగర్, బొబ్బిలి కుంట చెరువుల్లోకి తరలిస్తుండడంతో అవి కలుషితమవుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

కలగానే 'భూగర్భ కాలువ'



మురుగు చేరే మహబూబ్‌సాగర్ చెరువు

కాగితాలకే పరిమితం..

సంగారెడ్డి పురపాలికలో 38 వార్డులు, 22,145 నివాసాలున్నాయి. వీటి ద్వారా రోజూ 12 లక్షల మెట్రిక్ టన్నుల మురుగు బయటికి వస్తోందని పురపాలక అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పట్టణంలో భూగర్భ మురుగు కాలువ నిర్మాణానికి 2018లో అప్పటి పురపాలక అధికారులు రూ.5 కోట్ల నిధులతో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించారు. దీనికి సంబంధించిన అన్ని రకాల అనుమతులూ తీసుకున్నారు. 2020లో జరిగిన పురపాలిక ఎన్నికల్లోనూ అన్ని పార్టీలు భూగర్భ మురుగు కాలువ నిర్మాణాన్ని ఎజెండాగా తీసుకున్నాయి. ఆ తరవాత అధికారులు, పాలకవర్గ సభ్యులు పట్టించుకోకపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. భూగర్భ మురుగు కాలువ లేకపోవడంతో కాలనీల్లోనే ఇళ్ల ముందు మురుగు నిలిచి దుర్గంధంగా మారుతోంది.

చెరువులు కలుషితం..

పట్టణంలోని మురుగు ఎక్కువగా భాగం మహబూబ్‌సాగర్ చెరువులోకి తరలిస్తున్నారు. దీంతో చెరువులో మురుగు చేరి కలుషితమవుతోంది. ఈ ఏడాది కలుషిత నీటితో చేపలు మృత్యువాత పడ్డాయి. ఉదయం, సాయంత్రం కట్టపై వాకింగ్‌కు వెళ్లేవారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మురుగు చెరువులోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి..

– శ్రీధర్, ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి, అధ్యక్షుడు

పట్టణంలో భూగర్భ మురుగు కాలువ పనులు వెంటనే ప్రారంభించాలి. మురుగు మహబూబ్‌సాగర్ చెరువులోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. అధికారులు ఇందుకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం..



– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ

భూగర్భ మురుగు కాలువ కోసం గతంలో ప్రతిపాదనలు రూపొందించిన మాట వాస్తవం. అనుమతులు రాకపోడంతో పనులు చేయలేదు. మళ్లీ ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. చెరువులోకి మురుగు వెళ్లకుండా వేరే దారిలో మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

ధాన్యం కేంద్రాల్లో సమస్యలు తలెత్తొద్దు: మంత్రి



మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పంట రుణమాఫీ ఇప్పటి వరకు 98,245 మంది రైతులకు రూ.849 కోట్ల నగదు జమ చేశామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రుణమాఫీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు కుటుంబాల సర్వే చేశారని ఆ ప్రకారం రూ.2లక్షల రుణం మాఫీ చేయాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర ప్రకారం రైతులకు 48 గంటలో నగదు జమ చేయాలన్నారు. తూకంలో మోసం లేకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గోశాల వార్షికోత్సవానికి మంత్రికి ఆహ్వానం

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: నవంబరు 2వ తేదీన నిర్వహించనున్న శ్రీకృష్ణ గోశాల ద్వితీయ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ బుధవారం రాత్రి నిర్వాహకులు మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

ఖేడ్‌లో రవాణాశాఖ సేవలు ప్రారంభం



వాహనాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ వెంకటయ్య

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: రవాణాశాఖ సేవలు ఖేడ్‌లో గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పలు వాహనాలు ఫిట్‌నెస్ కోసం రాగా ధ్రువపత్రాలను క్షుణ్నంగా పరిశీలించిన ఎంవీఐ వెంకటయ్య నిబంధనల మేరకు పత్రాలు జారీ చేశారు. పుర ఉపఛైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ నర్సింహులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ ఎంవీఐని కలిసి సేవలను ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. ప్రతి గురువారం ఫిట్‌నెస్, డ్రైవింగ్ టెస్ట్, కొత్త ఆటోల రిజిస్ట్రేషన్, లెర్నింగ్ లైసెన్సుల జారీ సేవలు మాత్రమే ఇక్కడ అందిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాటి రెన్యువల్ కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో అన్ని రకాల సేవలను ఇక్కడే అందించే అవకాశం ఉందన్నారు. రవాణాశాఖ సేవలు ప్రారంభించినందుకు ఎంవీఐని ప్రాంతీయ కార్యాలయంలో మండల కేంద్రం నిజాంపేటకు చెందిన యువకులు శాలువాలతో సన్మానించారు.

క్రీడా ప్రాంగణం.. పొదలమయం



ప్రతి గ్రామంలో ఆటలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు, కావాల్సిన సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. అధికారుల నిర్లక్ష్యంతో చాలా చోట్ల వినియోగంలోకి రాలేదు. నాగల్‌గిద్ద మండలం వల్లూరులోని ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆట పరికరాలు పాడయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మనూరు.

కుక్కల బెడద నివారించండి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: మండల పరిధి జూకల్‌తండాలో కుక్కల బెడద నివారించాలని గురువారం తండావాసులు మండల పరిషత్తు కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఏడాదిగా తండాలో కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికే పలువురు పిల్లలు, పెద్దలపై దాడులు చేశాయన్నారు. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి శాలిపేటలో ఉప్పరి గణేష్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గత నెల 10న ప్రారంభించారు. మొత్తం 22జట్లు తలపడ్డాయి. గురువారం ఫైనల్‌లో గెలిచిన శాలిపేట జట్టుకు రూ.10వేల నగదు, రన్నర్‌గా నిలిచిన చిట్టోజిపల్లి జట్టుకు రూ.5వేలు నిర్వాహకులు అందించారు. పలువురు పాల్గొన్నారు.

కేటీఆర్ దృష్టికి సమస్యలు

నారాయణఖేడ్: నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు, భారాస నేత మల్గొండ గురువారం భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను హైదరాబాదులో కలిశారు. పార్టీ పరిస్థితి, ప్రజా సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జీవన ఎరువుల వినియోగంపై రైతులకు విద్యార్థులు అవగాహన కల్పించారు. గురువారం సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ● గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి నాణ్యత పరీక్షలపై అవగాహన ఉండాలని మిషన్ భగీరథ ఈఈ ఎస్‌కే పాష సూచించారు. గురువారం సంగారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులు నిర్వహించారు.

హనుమాన్ చాలీసా పారాయణం

సదాశివపేట: వినాయకుడి విగ్రహం ధ్వంసమైన ఘటనకు ప్రాయశ్చిత్తంగా గురువారం హిందు సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ ఘటనలో దుండగులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించరూ..



మాట్లాడుతున్న అంజాగౌడ్

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించడంతో పాటు వాటిని ఖర్చు చేయాలని కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ కోరారు. గురువారం ఖేడ్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. యువతకు ఉపాధి, కార్మికులకు ద్విచక్రవాహనాలు అందించాలన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ పదేళ్ల ప్రయాణం పేరిట రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఆహార పంటలపై అవగాహన

హత్నూర,న్యూస్‌టుడే: ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా యక్షి స్వచ్ఛంద సంస్థ సహకారంతో, సత్య శోధన యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం సికింద్లాపూర్‌లో రైతులకు ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. మండలంలోని 15 గ్రామాల నుంచి వచ్చిన రైతులు, మహిళలకు ఆధునిక వ్యవసాయం, పెట్టుబడులు, దిగుబడులు, సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

చెరువులో చేపలు మృతి

హత్నూర,న్యూస్‌టుడే: మండల పరిధి బోర్పట్ల పెద్ద చెరువులో గురువారం చేపలు మృత్యువాత పడ్డాయని మత్స్యకారులు తెలిపారు. చెరువుకు చుట్టూ రసాయన పరిశ్రమలు ఉండడంతో వాటి నుంచి వ్యర్థజలాలు నీటిలో కలిసి చేపల మృతికి కారణమై ఉండొవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట భారీ వర్షం కురిసిందని, వరదలో వ్యర్థ జలాల కలిసి ఉంటాయని పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో జీవితాల్లో వెలుగులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ బాధ్యులు

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: వ్యక్తిత్వ వికాసంతో జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి పట్లోళ్ల అనుపమా రెడ్డి అన్నారు. ఇంప్యాక్ట్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఖేడ్ శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. విశిష్ట అతిథిగా హాజరైన సంస్థ ఉపాధ్యక్షుడు సుధీర్ బంధం రావూరి.. ఖేడ్ ప్రాంత ఇన్‌ఛార్జిగా సంతోష్‌కుమార్, అధ్యక్షులుగా నియమితులైన శ్వేత, అంజలి, లావణ్య, నర్సింహారెడ్డి, భాస్కర్, జ్యోతిర్లింగం, ఆంజనేయులు, చంద్రకాంత్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రాంతీయ డైరెక్టరు రాంకమల్, లీడర్‌షిప్ కేవీ సురేష్‌కుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

వాల్మీకికి ఘన నివాళి





రాయికోడ్ మండలం మహ్మదాపూర్, కోహీర్ మండలం గొడిగార్‌పల్లిలో నివాళులు అర్పిస్తున్న వాల్మీకి బోయ సంఘం నాయకులు

జిల్లా వ్యాప్తంగా మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం.



వట్‌పల్లి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో..

ఘనంగా పరశురాముడి విగ్రహ ప్రతిష్ఠాపన



నాయకులను సన్మానించిన గ్రామస్థులు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: మండల పరిధి చిరాగ్‌పల్లిలోని శ్రీతుల్జా భవానీ మాత ఆలయంలో పరశురాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ప్రతినిధి డా.ఉజ్వల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు నేతలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

వీరభద్రస్వామి దేవాలయంలో చండీ హోమం



గుమ్మడిదల, న్యూస్‌టుడే: బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని చండీ హోమం నిర్వహించారు. ఉదయం వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో హోమశాలలో అర్చకులు చండీహోమం నిర్వహించి పూర్ణాహుతితో ప్రత్యేక పూజలు చేశారు.

25 మందికి కంటి శస్త్ర చికిత్సలు

జిన్నారం, న్యూస్‌టుడే: ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఖాజీపల్లి, 181 జీఎంఆర్ కాలనీకి చెందిన 25 మందిని కంటి శస్త్ర చికిత్సలకు గురువారం ఆసుపత్రికి తరలించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి కంటి సమస్యలు గుర్తించారు. ఈ మేరకు 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని ప్రత్యేక బస్సులో ఆసుపత్రికి తీసుకెళ్లామని ఫౌండేషన్ అధ్యక్షుడు రమాకాంత్ తెలిపారు.

మోదీ పాలనపై ప్రజల్లో సంతృప్తి



మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు చేస్తున్న భాజపా నాయకులు

పుల్కల్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై దేశ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తోందని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమమే పరమావధిగా కేంద్రం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో అందోల్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి రాములు, మండల అధ్యక్షుడు పండరి, నాయకులు రమేష్, నర్సింలు, రవీందర్‌నాయక్, శివ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జిన్నారం, న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం పట్టణంలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పుర అధ్యక్షురాలు కె.రోజారాణి అన్నారు. గురువారం పట్టణంలోని 13, 22వ వార్డుల్లో భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మిషన్ భగీరథ నీటి ట్రయలింగ్, కనెక్షన్ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేణుపాల్ రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.

జూదమాడితే చర్యలు

సిర్గాపూర్, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా జూదం ఆడితే చర్యలు తప్పవని ఎస్సై వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు జూదం ఆడినా.. ఆడించినా.. కేసులు పెట్టి జైలుకు పంపుతామన్నారు. ఆడుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎస్సీ వర్గీకరణ త్వరగా చేయండి

జహీరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను త్వరగా చేయాలని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీకి గురువారం హైదరాబాద్‌లో వినతిపత్రం ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే పూర్తి చేయాలని కోరారు.

ఉపాధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

సిర్గాపూర్, న్యూస్‌టుడే: గ్రామాల్లో నిర్వహించే ఉపాధిహామీ పనుల ప్రణాళికల తయారీపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో మల్సూర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025- 2026 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులపై ముందస్తుగా చర్చించినట్లు తెలిపారు. ఏపీవో బస్వరాజ్, ఎంపీవో బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా విష్ణుసాగర్



జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: అందోలు తహసీల్దార్‌గా ఎన్‌బీ విష్ణుసాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఖేడ్ నియోజవర్గంలోని కంగ్టి తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. భూ సంబంధ, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

యువకుడి అదృశ్యం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు. జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లికి చెందిన హుక్కరేణి సాంసన్(30) ఈనెల 14న ఆసుపత్రికని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ఉద్యమకారుడి కుటుంబానికి అండ

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: ఉద్యమకారుడు, మాజీ జడ్పీటీసీ విజయరామరాజు ఉద్యమ సమయంలో, ప్రజాప్రతినిధిగా అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మల్కాపురంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశాడని, అలాంటి వారి కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.